సాక్షి వనపర్తి

బుధవారం, 31, మే, 2023



'పొగ' చూరుతోంది..

కొందరు యువత పొగకు బానిసగా మారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

వివరాలు 8లో ▸



..భవిష్యత్‌ను పాతరేశారు

పేదల భూములను లాక్కొని వారి భవిష్యత్‌ను పాతరేశారని భట్టి విక్రమార్క అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /25.0

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంబరాలకు రైతువేదికలు సిద్ధం చేయండి



అమరచింత: రాష్ట్ర దశాబ్ది వేడుకలు పండుగ వాతావారణంలో పల్లెపల్లెన నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వీటికోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని డీపీఓ సురేష్ కుమార్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, గ్రామాల్లో ప్రజలను ఒకే వేదికపై తీసుకురావాలని కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయ్యడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతువేదికలలో సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేల ఆయా గ్రామాల సర్పంచ్‌లు ,పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. జూన్ 3వ తేదీన రైతు వేదికల వద్ద ఆయా గ్రామాల రైతులతో సంబురాలు, సామూహిక భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. జూన్ రెండు నుండి 21 వరకు ప్రతి నిత్యం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేల ప్రణాళిక సిద్ధం చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎఈఓలు రాజేష్,మల్లేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్: 2023–24 సంవత్సరం వికలాంగుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రామ మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల కోసం వచ్చే నెల 9వ, తేదీలోగా http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 6వ, తేదీ మధ్యలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సంబంధిత దరఖాస్తులను ఎంపీడీఓ (మండల కమిటీ) ద్వారా వచ్చే నెల 16వ, తేదీలోగా జిల్లా సంక్షేమ శాఖకు పంపాలని, ఆలస్యంగా అందిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ స్టేట్ బెనిఫిషరీ, మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం (బీఎంఎంఎస్) వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ క్వింటా రూ.6,869

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు మంగళవారం 118 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.6869, కనిష్టం రూ. 4166, సరాసరి రూ. 6510 ధరలు లభించాయి. అలాగే, 57 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5311, కనిష్టం రూ. 3256, సరాసరి రూ. 5301 ధర పలికింది. 417 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2013, కనిష్టం రూ. 1376, సరాసరి రూ. 2013 ధరలు వచ్చాయి. క్వింటాశ్ కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 8050 ధరలు పలికాయి.

ఉత్సాహంగా సౌతిండియా డాన్స్ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన సౌతిండియా డాన్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ధూమ్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఓపెన్ విభాగం సోలో, డ్యూయల్, గ్రూపు విభాగాల్లో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ డాన్స్ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాలకు చెందిన డాన్స్ అకాడమీలకు చెందిన 350 మంది చిన్నారులు, యువత పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మాధవ్ మాస్టర్, నరేష్ ఆనంద్ మాస్టర్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. రాత్రి జరిగిన కార్యక్రమంలో సినీ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ గెలుపొందిన వారికి ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ డాన్స్ పోటీలతో కళాకారుల్లో దాగిన ఉన్న నైపుణ్యం బయటకు వస్తుందన్నారు. మహబూబ్‌నగర్‌లో సౌతిండియా డాన్స్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధూమ్ డాన్స్ స్టూడియో డైరెక్టర్ అబ్దుల్ అజీమ్, డాన్స్ మాస్టర్లు శివ, తిరుపతి,, రాఘవ్, యాదవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దేశానికి దిక్సూచిగా పాలన

- అందరికీ సమన్యాయం అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి
- ఫ్రెండ్లీ పోలీసింగ్ దేశానికే ఆదర్శం
- మహిళల భద్రత కోసమే షీటీంల ఏర్పాటు
- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- వనపర్తిలో జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభం



వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట మంత్రులు, పోలీస్ ఉన్నతాధికారులు



జిల్లా పోలీస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజన్‌కుమార్

వనపర్తి: హైదరాబాద్ మినహా..మిగతా ప్రాంతం వెనుకబాటుకు గురైన తెలంగాణను రాష్ట్ర ఏర్పాటు తర్వాత అభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ పక్కనే రూ.32 కోట్ల వ్యయంతో 29.29ఎకరాల విశాలమైన ప్రదేశంలో భవిష్యత్ వందేళ్లకు ఉపయోగపడేలా నిర్మాణం చేసిన నూతన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఆయన మంత్రి నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజన్‌కుమార్, మల్టీజోన్–2 ఐడీ షానావాజ్ ఖాశీంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హోంశాఖ మంత్రి మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు, పాలన ఇతర ప్రాంతాల్లో అమలు చేయాల్సిన స్థితి ఏర్పడిందని, ఫ్రెండ్లీ పోలీస్, పోలీస్‌శాఖలో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయటం లాంటి సాహసోపేత సంస్కరణలు చేసిన ఘనత తెలంగాణ సొంతం అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే విద్యుత్ హాలీడే ప్రకటించాల్సి వస్తుందని విమర్శించిన నాయకుల నోళ్లు మూయించేలా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. సాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక వ్యవసాయం సాగక రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన రోజు నుంచి రైతే రాజు అన్న రోజులను తెలంగాణలో చూస్తున్నామన్నారు. పరిపాలన సులభతరం చేసేందుకు పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాల రాష్ట్రంగా ఆవిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

■ రాష్ట్రంలో అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీస్ విధానం దేశానికే ఆదర్శమని హోంమంత్రి అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత పోలీస్‌శాఖకు సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, పలు సంస్కరణలతో పోలీస్‌శాఖ ఖ్యాతిని ఆయా ప్రాంతాలకు విస్తరింపజేశారన్నారు. పోలీసు శాఖలో షీ టీంలను ఏర్పాటు చేయటం, అందరికీ సమన్యాయం జరిగేలా మార్గదర్శకాలు చేయటం సత్ఫలితాలిస్తున్నట్లు వెల్లడించారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించేందుకు రాష్ట్రంలో పోలీస్‌శాఖ శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని డీజీపీ అంజన్‌కుమార్ అన్నారు. ప్రజలకు ఉత్తమ పోలీస్‌సేవలు అందించటంలో అధికారులు అంతా కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖ నిర్విరామంగా కృషి చేస్తున్నదని, వనపర్తి ఎస్పీ రక్షితా కె.మూర్తి ఉత్తమ సేవలను డీజీపీ ప్రశంసించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా కొత్త, పాత జిల్లాల్లో నూతన ఎస్పీ కార్యాలయాల నిర్మాణం చేపట్టడం సీఎం దార్శనిక పాలనకు నిదర్శనమన్నారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ.. సుమారు రూ.2.5 కోట్లతో మారుమూల ప్రాంతాలలో పోలీస్ స్టేషన్‌ల నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రస్తుత పోలీస్ స్టేషన్ల నిర్మాణంతో మారుమూల ప్రాంతాల వారికి పోలీస్ సేవలు త్వరితగతిన అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తి. ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఏఎస్పీ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం

వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, తాగునీరందించే విషయంలో రాష్ట్రం.. దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేద ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం, ఎస్పీ కార్యాలయం తరహాలోనే.. వనపర్తి చిహ్నంగా నిలిచిన సంస్థానాధీశుల నాటి రాజమహల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు శాంతి భద్రతలు అమలు చేయటంలో పోలీస్‌శాఖ మెరుగైన సేవలందిస్తోందన్నారు.

వచ్చే నెల 8 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 8,9,10వ, తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. చేపల ద్వారా వివిధ రకాలైన ఆహార ఉత్పత్తులు, వాటి నుంచి వచ్చే పోషక విలువలు, రుచులు పరిచయం చేయడానికి ఈ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 10 స్టాళ్లలో వివిధ రకాలైన, రుచికరమైన చేపలు, రొయ్యల వంటలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అనుభవం కలిగిన ఔత్సాహికులు, వివిధ హోటల్, రెస్టారెంట్ల వారు తమ వంటల నైపుణ్యంతో రకరకాల వంటలను ప్రదర్శించాలని కోరారు. ఇందుకు వచ్చేనెల 2వ, తేదీలోగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు వర్షం సూచన



బిజినేపల్లి: పాలెం కృషి విజ్ఞాన కేంద్ర వాతావరుణ సూచనల ప్రకారం బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా వడగండ్లతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రంలో డీఎస్సీ జాడేలేదు..



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీతో పాటు రెండు డీఎస్సీలను నిర్వహించిందని, తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీ, గాంధీనగర్ 2,3, ప్యాటగడ్డ కాలనీల్లో చిన్నారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వస్తే విద్యారంగంలో మెరుగుపడతామని భావిస్తే, రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ విద్యా ప్రమాణాలను ఏ మాత్రం పెంచలేకపోయారని ఆక్షేపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కళాశాలలో యూనివర్సిటీల్లో సగానికి పైగా పోస్టులు లేకపోవడంతో విద్యారంగాన్ని కేసీఆర్ నాశనం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యారంగం పై ప్రత్యేక శ్రద్ధతో విప్లవాత్మక మార్పులు తీసుకరావడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం విద్యలో తెచ్చుకున్న పేరుకు మించి విద్యలో తెలంగాణను ఒక మోడల్‌గా నిలిపేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా, చిన్నారెడ్డి ప్రారంభించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర మంగళవారానికి 40 రోజులు పూర్తి చేసుకుంది. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు విజయ్ చందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్‌కుమార్, నందిమల్ల యాదయ్య, కదిరే రాములు, మన్నెంకొండ, ఎల్లన్న, జనార్ధన్, రాములు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెంటన్న, పర్వతాలు, దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయాశాఖల అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 21 రోజుల పాటు రోజుకో శాఖ తరఫున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేదికను ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర ఏర్పాట్ల వివరాలను తమకు ముందుగా సమర్పించాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రైతు సమితి అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

21 రోజుల పాటు నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని, అలాగే గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలతోనే ఉత్సవాల ఏర్పాట్లు చేయించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలలో నిర్వహించే కార్యక్రమాలను ప్రజలకు ముందస్తుగానే తెలియజేయాలని, ఏ రోజు, ఏ శాఖ తరుపున ఏ ప్రాంతంలో కార్యక్రమం నిర్వహిస్తున్న వివరాలు తెలిస్తేనే పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ నరసింహ్ములు, డిపిఓ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది అభివృద్ధి సిద్ధాంతం



సభావేదికపై ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

- రాద్ధాంతం చేస్తున్న ప్రతిపక్షాలు
- పేదల కలలను సాకారం చేస్తున్న సీఎం కేసీఆర్
- జూన్‌లో గృహలక్ష్మి పథకం ప్రారంభిస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అభివృద్ధి సిద్ధాంతంగా సంక్షేమ పథకాలను అందిస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం అచ్చంపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. రాజీవ్‌నగర్ సమీపంలో నిర్మించిన 150 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అలాగే 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో లేని సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తున్నామన్నారు. నీతి ఆయోగ్ సర్వేలో తెలంగాణ ఏర్పడక ముందు ఆరోగ్యశాఖ 14వ స్థానంలో ఉండగా.. ప్రస్తుతం 3వ స్థానంలో ఉందన్నారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని, అందుకు తగ్గట్టుగానే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తులు ఉన్నా జిల్లాకు కనీసం ఒక్క డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయలేకపోయారన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వైద్య రంగానికి ప్రభుత్వం రూ.13 వేల కోట్లు వెచ్చించిందన్నారు. గరీబోళ్ల కలలను సీఎం కేసీఆర్ సాకారం చేస్తున్నారని, పేద ప్రజలకు సీఎం కేసీఆర్ శ్రీరామ రక్షగా ఉన్నారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేశామని, జూన్‌లో గృహలక్ష్మి పథకం ప్రారంభించి ఇళ్ల స్థలాలు ఉన్నవారికి రూ.3 లక్షలు అందిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతో ప్రవేశపెడుతున్నారని కొనియాడారు.

➔ అన్నిరంగాల్లో వెనకబడిన నల్లమల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు సహకారంతో అచ్చంపేటను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని రాద్ధాంతాలు చేసినా అభివృద్ధి పనులను ఆపమన్నారు. కొన్ని అభివృద్ధి పనులకు ఆలస్యం జరిగినా పూర్తి చేస్తామన్నారు.

➔ మారుమూల ప్రాంతానికి కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందడం అదృష్టంగా భావిస్తున్నామని ఎంపీ రాములు అన్నారు. చెంచులు, గిరిజనులు వైద్యానికి నోచుకోక చాలా తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఇకపై అలాంటి పరిస్థితులు ఉండవన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ముచ్చటగా మూడోసారి గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

➔ మంత్రి హరీశ్‌రావు అహర్నిషలు పనిచేసి వైద్యరంగాన్ని దేశంలోనే మూడోస్థానానికి తీసుకొచ్చారని తెలంగాణ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఆరోగ్య తెలంగాణ సాధించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

కలెక్టర్‌పై మంత్రి ఆగ్రహం..

డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులకు పత్రాలు ఇచ్చే క్రమంలో అక్కడ ఏర్పాటు సమావేశంలో ఆర్డీఓ లేకపోవడంతో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించి పత్రాలు ఇవ్వాల్సిన రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, వైస్ చైర్మన్ బాలాజీసింగ్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ రమేష్‌కుమార్, నర్సింహగౌడ్, మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ రమేష్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట సభకు హాజరైన ప్రజలు

రూ.2,300 కోట్లతో అచ్చంపేట లిఫ్ట్

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని సీఎం కేసీఆర్ రూ.2,300 కోట్లతో అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేశారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినందుకు ధన్యావాదాలు తెలిపే సభ ఏర్పాటు చేశారు. ఉమమహేశ్వర, చెన్నకేశవ, ఆంజనేయస్వామి రిజర్వాయర్లు, నిరంజన్‌షావలీ లిఫ్టులను మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కృష్ణాజలాలు నల్లమలను ముద్దాడితే ఈ ప్రాంతం రూపురేఖలు మారుతాయన్నారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పట్టువదలని విక్రమార్కుడిలా లిఫ్టు సాధించుకున్నారని కొనియాడారు. లిఫ్టు పూర్తి చేయడంలో, భూ సేకరణలో రైతులకు మంచి డబ్బులు ఇప్పించేలా తన సహకారం ఉంటుందన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులు పూర్తి చేయడం ఒక్క కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అడిగిన నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎస్ఎల్‌బీసీలో భూ సేకరణ పరిహారం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోటా పెంచాలని కోరారని ఈ మేరకు సీఎం దృష్టికి తీసికెళ్లి మంజూరుకు కృషిచేస్తానన్నారు.

వైభవంగా శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు

కందనూలు: శ్రీపురం శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, గరుడ ముద్ద, భేరీపూజ, దేవతాహ్వానం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలతో శ్రీపురంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా.. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 11 నుంచి శ్రీగోదా రంగనాథ స్వామి తిరు కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నారు. లోకకల్యాణార్థం నిర్వహించే కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం అనంతరం సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

పాలమూరు ఆర్చర్ల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాలమరు క్రీడాకారులు ప్రతిభచాటారు. విష్ణువర్ధన్ రజతం, రాంనాయక్‌తండాకు చెందిన సుజాత మహిళల విభాగం కంపౌండ్‌బౌలో కాంస్య పతకం సొంతం చేసుకున్నారు.

క్లుప్తంగా

కుంటలోపడి బాలుడి మృతి


నాగపూరి విఘ్నేష్ (ఫైల్)

కోడేరు: కుంటలో పడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో మంగళవారం చోటుచేసుకుంది. ఆ సంఘటన వివరాలు.. గ్రామానికి చెందిన కుమ్మరి నాగపూరి ప్రశాంత్, స్వాతికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు నాగపూరి విఘ్నేష్(4) మధ్యాహ్నం ఊరి శివారులో ఊరకుంట వద్దకు ఆడుకుంటూ వెళ్లాడు. కుంటలో నీరు ఉండటంతో నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓ వ్యక్తి కుంటవద్దకు మూత్రవిసర్జనకు వెళ్లి చూడగా అక్కడ బాలుడు మృతి చెంది ఉన్నాడు. దీన్ని చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు.

ట్రాక్టర్ పైనుంచి కింద పడి..

వీపనగండ్ల: మండలంలోని సంపట్రావ్‌పల్లిలో పెళ్లి పందిరి ఆకు కోసం వెళ్లిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై నుంచి పడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలో జరుగుతున్న ఓ పెళ్లిలో పందిరి వేయడానికి కొంతమంది వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున ఆకు కోసం వెళ్లారు. ఈ క్రమంలో చాకలి కృష్ణయ్య(54) ట్రాక్టర్‌పై ఆకును తీసుకుని వస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. కృష్ణయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉత్సవ విగ్రహాల చోరీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు శ్రీకృష్ణ దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు, గంటను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఆలయాన్ని మూసివేసిన పూజారి మంగళవారం ఉదయం వెళ్లి చూడగా ఈ విషయం తెలిసిందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆలయ కమిటీ సభ్యులు పరశురాముడు, రాముడు, స్వామి, బాలపీరు, కృష్ణయ్య తెలిపారు.

గోవా మద్యం సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: వాహన తనిఖీల్లో గోవా నుంచి అనుమతి లేకుండా కారులో తరలిస్తున్న మద్యం సీసాలను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున జిల్లాకేంద్రంలోని పిస్తాహౌజ్ సమీపంలో చేసిన వాహన తనిఖీల్లో హైదరాబాద్‌కు చెందిన సిద్దేశ్వర్ అనే వ్యక్తి గోవా నుంచి హైదరాబాద్ వెళ్తూ ఇన్నోవాలో డ్యూటీ పే చేయకుండా నాలుగు మద్యం సీసాలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడిపై కలప వ్యాపారి దాడి


గాయపడిన జనార్దన్

హన్వాడ: కొనగట్టుపల్లికి చెందిన ఇప్పలి జనార్దన్ గ్రామానికి చెందిన కలప వ్యాపారి సంజీవ్ తనపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడని మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుల కథనం మేరకు వివరాలు... సంజీవ్ ఈనెల 27న అక్రమంగా కలపను జిల్లాకేంద్రానికి తరలిస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. సుమారు నాలుగు డీసీఎంల కలపను సీజ్ చేసి అతడి పొలంలోనే నిల్వ చేసి వెళ్లారు. కాగా సంజీవ్ నిల్వ చేసిన కలపను మళ్లీ తరలించేందుకు యత్నించడంతో అధికారులు మరోసారి పట్టుకుని రూ .14100 ఫైన్ వేసి, కలప వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసున మోదు చేశారు. కాగీ దీనంతటికి జనార్దన్ కారణమనే అనుమానంతో అతడి ఇంటిపైకి కుటుంబీకులతో కలిసి కర్రలు, రాళ్లతో సంజీవ్ దాడికి పాల్పడ్డారు. ఘటనలో జనార్దన్ తీవ్రంగా గాయపడ్డాడు పోలీసులను ఆశ్రయించగా కేసునమోదు చేశారు. అదేవిధంగా జనార్దన్‌కు ప్రాణహాని ఉందని కాపాడాలని అతడి భార్య నాగమణి సైతం అటవీశాఖ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేసింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

అడ్డాకుల: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకులకు చెందిన వినయ్ వినయ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

పొగ చూరుతోంది..



- జిల్లా కేంద్రంలో బహిరంగంగా ధూమపానం
- పెరిగిన సిగరెట్ కాల్చే వారి సంఖ్య
- నేడు పొగాకు నివారణ దినోత్సవం

మహబూబ్‌నగర్ క్రైం: 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అన్నాడు గిరీశం పంతులు. నిజంగానే వచ్చే జన్మలో దున్నపోతులమై పోతామన్న భయమో, లేక సోకు(ఫ్యాషన్) అన్న మత్తులోనో తెలియదు కానీ, గుప్పు గుప్పుమంటూ దమ్ము లాగేస్తున్నారు. నేటి యువత.. జీవితంలో ఎంజాయ్ చేస్తున్నామనే భావనలో ప్రాణాంతక వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. సిగరెట్ కాలినట్లే తమ ఆరోగ్యం కాలిపోతుందనే విషయం గమనించలేకపోతున్నారు. జిల్లాలో యుక్తవయస్సు వచ్చిన విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సిగరెట్, బీడీ, తంబాకు, ఖైనీ, జర్దా, గుట్కాల వంటి మత్తు పొగాకు మోజులో ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. గుట్కాను ప్రభుత్వం నిషేధించినా జిల్లా కేంద్రంలో మాత్రం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి గుట్కా, తంబాకు సరఫరా అవుతోంది. పాన్ దుకాణాలు, కిరాణాలు, టీ హోటళ్లలో అమ్ముతున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.200వరకు అమ్ముతున్నారు. కాగా ఒక్కో గుట్కాను రెండింతలు, మూడింతలు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. ఇలా రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు.

కనిపించని తనిఖీలు..

పోలీసులతోపాటు పురపాలక, పంచాయతీ శాఖ, ఆహార తనిఖీ అధికారి, ఆర్టీఓ, కార్మిక శాఖ, విజిలెన్స్ అధికారులు ఈ విక్రయాలను అరికట్టేందుకు దాడులు నిర్వహించాలి. కానీ ఎక్కడా ఆశించిన స్థాయిలో దాడులు జరగడంలేదు. వీరన్నపేట, వన్‌టౌన్, భగీరథకాలనీ, ఆకుల చౌరస్తా, క్లాక్‌టవర్, మార్కెట్ రోడ్, పాత బస్టాండ్, న్యూటౌన్ మున్సిపల్ కాంప్లెక్స్, జిల్లా ఆస్పత్రి వద్ద చిన్నహోటళ్లు, పద్మావతికాలనీ, శ్రీనివాసకాలనీ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని దుకాణాల్లో గుట్కాలు విక్రయిస్తున్నారు.

బహిరంగ ధూమపానం నేరం..

బహిరంగ ధూమపానం నేరమని 2003లో చట్టం అమలులోకి వచ్చింది. ప్రయాణ ప్రాంగణాలు, పార్కులు, రోడ్లపై, సినిమా థియేటర్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే చట్టరీత్యా నేరం. వీరికి జరిమానా విధించాలి. కానీ జిల్లాలో ఇప్పటివరకు పది కేసులు మాత్రమే నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. బహిరంగంగా సిగరెట్ తాగితే రెండేళ్ల జైలుశిక్ష, లేదా రూ.వెయ్యి జరిమానా వేస్తారు. పొగాకుపై ప్రచారం చేస్తే ఐదేళ్ల జైలు, లేదా రూ.5వేలు జరిమానా వేస్తారు.

జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది..



గుట్కాలు తింటే మొదట జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. అల్సర్‌కు దారి తీస్తుంది. ముఖ్యంగా నోటి క్యాన్సర్ వస్తుంది. దానివల్ల ప్రాణహాని కూడా ఉంటుంది. కడుపులో పేగులకు పుండ్లు అవుతాయి. నోటిలో చీగుళ్లవాపు, దంతాలు చెడిపోవడం, ఇతర సమస్యలు వస్తాయి. పొగతాగితే 4వేల రకాల రసాయనాలు, 43రకాల క్యాన్సర్ కారకాలు 400రకాల విష పదార్థాలు శరీరంలోకి చేరతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు వస్తాయి.

– డాక్టర్ బాల శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్

దమ్ము దమ్ముకూ జేబుకు చిల్లు..

జిల్లాలోని సుమారు 7లక్షల మందికి పైగా పొగాకును వాడుతున్నారు. వీరిలో 4లక్షల మేర యువతనే ఉన్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోంది. దుకాణాలు, హోటళ్లలో ధూమపానం చేసేవారు అధికంగా కనిపిస్తున్నారు. సిగరెట్ ఒకటి రూ.20 నుంచి రూ.25వరకు విక్రయిస్తున్నారు. రోజుకు 4 సిగరెట్ల లెక్కన రూ.100వరకు ఖర్చు చేస్తున్నారు. నెలకు రూ.3వేలు. అలాగే ప్రతిసారి చాయ్, వక్కపొడి తీసుకుంటారు. ఇలా నెలకు కనీసం రూ.4వేలు ఖర్చు చేస్తున్నారు.



పేదల భవిష్యత్‌ను పాతరేశారు..


సంజీవాపూర్ వద్ద భట్టి విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న జగదీశ్వర్‌రావు తదితరులు

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం ప్రజాస్వామిక ద్రోహి
- కాంట్రాక్టు బిల్లు కోసం ప్రజల నమ్మకాన్ని అమ్ముకున్నారు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపణ

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణానికి గత ప్రభుత్వాలు పేదలకు పంచిన భూములను బలవంతంగా లాక్కొని కార్యాలయాలు నిర్మించడం వారి జీవితాలతో చలగాటం ఆడటమే అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పేదల భవిష్యత్‌ను ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాల పునాదుల్లో పాతరేసి నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దకొత్తపల్లి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి లక్షలాది మంది ఓటర్లను కేసీఆర్ వద్ద తాకట్టు పెట్టిన ప్రజాస్వామ్య ద్రోహి అని దుయ్యబట్టారు. అనేక పార్టీలు మారి బతుకుదెరువు కోసం కాంగ్రెస్ పార్టీకి వస్తే టికెట్ ఇచ్చి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని కాంట్రాక్ట్ బిల్లు కోసం అమ్ముకున్నారని ఆరోపించారు. రూ.6 లక్షల బిల్లులకు ప్రభుత్వం నుంచి రూ.26 కోట్లు చెల్లించినందుకే కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ చేరారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 నుంచి 100 సీట్ల వరకు గెలిచి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరు వృద్ధులకు పింఛన్లు, 9 నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల అప్పులు చేసి ప్రజలపై రుద్దుతుందని విమర్శించారు. రైతు సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడంలో బీఆర్‌ఎస్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. యాసంగిలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని తూకాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. తరుగు పేరుతో మోసం చేస్తూ రైతులను మిల్లర్లు నిలువునా ముంచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దకొత్తపల్లి మండలంలోని సంజీవాపూర్‌లోకి రాగా భట్టి విక్రమార్కకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు చంద్రకల్ వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. మహిళలు కోలాటాలు, బొడ్డెమ్మలతో స్వాగతం పలికారు. పాదయాత్ర మంగళవారం రాత్రి ఆదిరాల, వావిళ్లబావి మీదుగా పెద్దకొత్తపల్లికి చేరుకుంటుంది. రాత్రి అక్కడే బస చేసి.. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మొదలై.. పెద్దకార్పాముల, దేదినేనిపల్లి మీదుగా అచ్చంపేట నియోజకవర్గంలోని అంబటిపల్లికి చేరుకుంటుంది. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణగౌడ్, నాయకులు రామయాదవ్, జగదీశ్వర్, తిరుపతమ్మ, కృష్ణయ్యగౌడ్, రాము, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో ఉద్రిక్త వాతావరణం


అల్లరిమూకలను చెదరగొడుతున్న డీఎస్పీ రంగస్వామి


నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, అనుచరులు

- భూ వివాదంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ
- ఆస్తులు ధ్వంసం.. చెదరగొట్టిన పోలీసులు

గద్వాల క్రైం: భూమి విక్రయంలో చోటుచేసుకున్న మనస్పర్థలు రెండు వర్గాల మధ్య ఘర్షణకు కారణమైన సంఘటన గద్వాల జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ధరూరుకు చెందిన బోయ మల్లి, బోయ గోవింద్ దాయాదులు. ఈ రెండు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా భూ వివాదం ఉంది. ఈ క్రమంలో గోవింద్ తన 1.20 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి నాలుగు నెలల క్రితం భూమిని విక్రయిస్తూ ఒప్పందం చేసుకున్నారు. అయితే ఇదే భూమిని శ్రీనివాస్‌రెడ్డి గోవింద్ వైరి వర్గమైన మల్లికి తిరిగి విక్రయించాడు. దీనిని జీర్ణించుకోలేని గోవింద్ భూమిని తమకే విక్రయించాలని శ్రీనివాస్‌రెడ్డితో గొడవ పెట్టుకున్నారు.

అసలు కథ ఇక్కడే..

గోవింద్ కుటుంబ సభ్యులు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్‌ను కలిసి భూ వివాదాన్ని వివరించారు. దీంతో వారం రోజుల క్రితం రంజిత్‌కుమార్ అనుచరులు ధరూరులో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా.. శ్రీనివాస్ రెడ్డితో గొడవ జరిగింది. దీనిని మనస్సులో పెట్టుకున్న రంజిత్‌కుమార్ అనుచరులు మంగళవారం గద్వాలలోని ఓ హోటల్ వద్ద శ్రీనివాస్‌రెడ్డిపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు గద్వాలకు చేరుకుని రంజిత్‌కుమార్‌కు సంబంధించిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం, శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లోని ఆయన ఇంటి వద్దకు వెళ్లి కారు, కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి.. కొంత మంది కార్యకర్తలపై దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని అల్లరి మూకలను చెదరగొట్టారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి తనపై హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం ఎదుట బైఠాయించగా.. బీఆర్‌ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకొని సంఘీభావం తెలిపారు. అనంతరం డీఎస్పీ రంగస్వామి అక్కడి వచ్చి శ్రీనివాస్‌రెడ్డికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి వారిని అక్కడి నుంచి పంపించారు.

కేసు నమోదు..

జిల్లాకేంద్రంలో చోటు చేసుకున్న ఘర్షణ వాతావరణంపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఇరువర్గాలకు చెందిన వారిపై సుమోటో కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రంగస్వామి తెలిపారు. గాయపడిన వారికి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. ముందస్తుగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం, రంజిత్‌కుమార్ ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం ప్రాజెక్టుకు 398 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. 7.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 178 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

శ్రీశైలంలో 34.2920 టీఎంసీల నీరు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 810.0 అడుగులు, 34.2920 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయంలో 251 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. ప్రాజెక్టు నుంచి ఎలాంటి నీటి విడుదల జరగడం లేదు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదశాత్తు ఈవీ బైక్ దగ్ధమైన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఐడీఎస్‌ఎంటీ కాలనీలో బాధితుడు వీరారెడ్డి నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి బైక్‌ను ఇంటి ఎదుట నిలిపి చార్జింగ్ పెట్టాడు. తెల్లవారుజామున చార్జింగ్ తీసివేసిన వెంటనే ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో బైక్ మొత్తం దగ్ధమైంది. దీని విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు.


దగ్ధమవుతున్న బైక్

పీయూ పేరు మార్చవద్దు..


పీయూలో నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరుపెడతామని ఇటీవల మంత్రి ప్రకటించిన నేపథ్యంలో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ పీయూలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపాయి. ఈమేరకు ఎంఎస్‌ఎఫ్ నాయకులు కార్తిక్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన 14 నియోజకవర్గాలను కలుపుకుని భౌగోళిక పాలమూరుకు పీయూ ప్రతిబింబంగా నిలుస్తుందని, అలాంటి యూనివర్సిటీ పేరును మార్చవద్దని పేర్కొన్నారు. సాహిత్యం కోసం పాటుపడిన వ్యక్తి సురవరం అని, పీయూలో అందుకు సంబంధించిన కోర్సులు ప్రవేశపెడితే బాగుంటుందని తెలిపారు. పీయూలో సమావేశ మందిరం, పరిశోధన విద్యార్థులకు హాస్టల్స్ వంటి సదుపాయాలు లేవని, వాటిని నిర్మించి కొత్త భవనాలకు ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాగేందర్, సుధాకర్, రాము, భరత్, వంశీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.35 లక్షల కలుపు మందులు సీజ్


రిజిస్ట్రర్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయ విజిలెన్స్ అధికారులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలోని విత్తన దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాల్లోని రిజిస్ట్రర్లను, స్టాకును పరిశీలించారు. విత్తన నిల్వలను పరిశీలించారు. ఇందులో భాగంగానే నిషేధిత కలుపు మందులను సీజ్ చేయడంతో పాటు ధ్రువీకరణ లేని పురుగు మందుల నిల్వలను గుర్తించి అమ్మకాలను నిలిపి వేయాల్సిందిగా ఆర్డర్ వేశారు. అదేవిధంగా ఆయా దుకాణాల్లో రూ.35.35లక్షల విలువ చేసే కలుపు మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. స్థానిక ఓం సాయిరాం ట్రేడర్స్ విత్తన దుకాణంలో ఈ నిషేధిక మందులను గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు ఏఓ నర్మద తెలిపారు. ఆమెతో పాటు నాగర్‌కర్నూల్ ఏడీఏ రమేశ్ బాబుతో పాటు విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

కార్సీలో సాగుతో లాభాలు


కార్సీ చెరకు తోట సాగు


కోత దశకు చేరిన చెరకు తోట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ప్రస్తుతం చెరకు సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. బోరు బావులు, చెరువులు, కాలువల కింద, నీటి లభ్యత ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కార్సీలో లాభాలు గడించవచ్చు. కార్సీ సాగు ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ సూచిస్తున్నారు. కార్సీలో మంచి దిగుబడులు సాధించాలంటే పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఏడీఏ రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

కార్సీ తోట అంటే...?

మొదటి సంవత్సరం సాగు చేసిన చెరకు మొక్కను తోట నుంచి తొలగించిన తర్వాత మిగిలిన మోళ్ల నుంచి తోటను పెంచే ప్రక్రియనే కార్సీ లేదా మర్దం తోటగా చెబుతారని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

పాటించాల్సి యాజమాన్య పద్ధతులు..

మొదటగా పూతకు రాని, తెగుళ్లను తట్టుకునే 87ఏ 298, 86వీ96, 2003వీ46 మొదలగు రకాలు కార్సీ సాగుకు అనువైనవి.

- సాధరణంగా మొదటి పంట సాగు చేసిన తర్వాత రైతులు పొలంలోని చెత్తను పొలంలోనే కాల్చివేస్తుంటారు. దీని వలన మొలక శాతం తగ్గుతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. మిగిలిన చెత్తను వరుసల మధ్య ఖాళీల్లో నింపితే మొలక బాగా వస్తుంది. కార్సీ తోట కొంతవరకు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.
- మొక్క తోట నాటినప్పుడు భూమి గుల్లగా ఉండి క్రమేపీ పంట కోత సమయానికి గట్టిపడుతుంది. ఫలితంగా కార్సీ తోటల మొక్కల వేళ్లకు ప్రాణ వాయువు అవసరమైనంత అందదు. నీరు కూడా సరిగ్గా ఇంకదు. కాబట్టి కార్సీ తోటల్లో వరుసల మధ్య భూమిని గుల్ల చేయడానికి 1.5 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కి చేయాలి. మొదళ్ల పక్కనున్న మట్టి తెగేటట్లు నాగళితో దున్నుకోవాలి. తద్వారా పాత వేళ్లు తెగి కొత్త వేర్లు వస్తాయి. పైరు పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది.
- తోటలో దుబ్బులు చనిపోయి ఖాళీలు ఏర్పడే అవకాశం ఉండటంతో ఖాళీలను తప్పనిసరిగా భర్తీ చేయాలి. లేదంటే దిగుబడి తగ్గుతుంది. ఈ ఖాళీలను భర్తీ చేయడానికి రైతులు ముచ్చెలు నాటుతారు. వీటి దుబ్బుల నుంచి వచ్చే పిలకలు సమానంగా పెరగవు. కాబట్టి ముచ్చెలకు బదులుగా పిలకలు నాటడం మంచిది.
- మొక్క తోట నరికే ముందు పొలంలో ఒకచోట ఎత్తైన నారుమడి తయారు చేసుకొని ఒంటి కన్నూ ముచ్చెలు నాటాలి. పిలకలుగా ఏర్పడిన తర్వాత ఐదారు వారాల వయస్సున్న పిలకలను కార్సీ తోట ఖాళీల్లో భర్తీకి ఉపయోగించాలి.
- చెరుకు పంట భూమి నుంచి ఎక్కువ పోషకాలు గ్రహిస్తుంది. మొక్క తోటకంటే కార్సీ తోటల వేళ్లకు ఎరువులను గ్రహించే శక్తి తక్కువగా ఉంటుంది. కాబట్టి సిఫార్సు చేసిన నత్రజని కన్నా ఎకరాకు 45 కిలోలు అదనంగా వేసుకోవాలి. మోళ్లు చెక్కిన వెంటనే 145 కిలోలు, 45 రోజుల్లో 145 కిలోల యూరియా చల్లాలి. భాస్వరం, పొటాష్ ఎరువులను కార్సీ చేసిన వెంటనే దుబ్బల పక్కన గోతులు తీసి వాటిలో వేసి కప్పాలి.
- కార్సీ తోటల్లో ఇనుప ధాతువు లోపం ఎక్కువగా కనిపిస్తోంది. దీని నివారణకు ఎకరాకు 2కిలోల ఫెరస్ సల్ఫేట్‌ను పైరు 45-60 రోజుల దశలో ఉన్నప్పుడు రెండుసార్లు పిచికారీ చేయాలి.
- చెరుకు పంట నాలుగు నెలల వయస్సులో ఉన్నప్పుడు వరుసల మధ్య మట్టిని పదునైన పారలతో మొదళ్లకు ఎగదోయాలి. దీంతో ఆలస్యంగా వచ్చే పిలకలు అరికట్టడంతో పాటు ఈదురు గాలులకు తోటలు పడిపోకుండా ఉంటాయి.
- శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులతో పాటు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా కార్సీ తోటల్లో సైతం ఆశాజనక దిగుబడి పొందవచ్చు.